క్లుప్తంగా

పేరంటాలమ్మ ఆలయ చైర్మన్ రాజీనామా



బోయిన భాను ప్రదీప్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తన పదవీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరిని గురువారం ఆలయంలో కలిసి తన రాజీనామా పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాలతో ఇంకా సంవత్సర కాలం ఉండగానే రాజీనామా చేశానని తెలిపారు. చైర్మన్ హోదాలో గత మూడేళ్ల పదవీ కాలంలో ఆలయ అభివృద్ధికి, ఆలయంలో నిర్వహించే సంక్రాంతి, దసరా నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేశానని పేర్కొన్నారు. తనకు పూర్తి సహకారం అందించిన రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, అమ్మవారి భక్తులు, పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు ఆయిల్‌పామ్‌పై అవగాహన సదస్సు

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ విస్తరణపై ఉద్యాన, గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు మండల హార్టికల్చర్ ఇన్‌చార్జ్ అధికారి ఇ.హరిచంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి జే జ్యోతి, పలువురు అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాలకు చెందిన వీహెచ్‌ఏ, వీఏఏలు, పతంజలి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేడు గ్రామాల్లో డ్రైడే-ఫ్రైడే

విజయవాడరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే నిర్వహించాలని ఎంపీడీఓ (ఇన్‌చార్జి) బీఎల్వీ శేషగిరిరావు గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో గురువారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో అన్ని గ్రామాల్లోని వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుని డ్రైడే-ఫ్రైడే నిర్వహించాలని ఆదేశించారు. ఆదేవిధంగా ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు గ్రామాల్లో ఆధార్ అప్‌డేషన్ కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ క్యాంపుల్లో కొత్త ఆధార్ ఎన్రోల్మెంట్, డాక్యుమెంట్ అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్ చేయాలని పేర్కొన్నారు.

నేటి నుంచి నున్నలో గురుపౌర్ణమి వేడుకలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భీమవరపు సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7గంటలకు కలశస్థాపన, అఖండ దీపారాధన, గణపతి పూజ, మండపారాధన, మణి ద్వీపవర్ణన, 20వ తేదీ సాయి నామ జపం, సాయంత్రం బాబావారి గ్రామోత్సవం, 21న కాకడ హారతి, గోపూజ, బాబావారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర పూజ, సామూహిక సాయి సత్యవ్రతాలు, అనంతరం అన్నసమారాధన జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని బాబావారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 1.24 లక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ. 1.24 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాస్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో స్వామివారి హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. గత 80 రోజులకు గానూ రూ. 1,24,153లతో పాటుగా 10 అమెరికన్ డాలర్లు హుండీలో వచ్చినట్లు ఈఓ చెప్పారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉయ్యూరు సుధాకర్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. మాజీ సర్పంచ్ కాకాని అరుణ, దేవస్థానం ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెట్ల కింద నిలబడవద్దని, సెల్‌ఫోన్ వినియోగించడం ప్రమాదకరమని వీరవల్లి ఎస్ఐ ఎం.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగల వద్ద నిలబడవద్దని, వైర్లను పట్టుకోవడం వల్ల కరెంట్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కాల్వలు, చెరువుల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుందని, నీటి ప్రవాహ వేగాన్ని అంచనా వేసి ప్రజలు గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాలని ఎస్ఐ సూచించారు.

సమస్య మళ్లీ మొదటికే..

- రోడ్డు మార్జిన్‌లను వదలని వ్యర్థాల బెడద
- దుర్గంధంతో ప్రజల అవస్థ
- ప్రజారోగ్యానికి పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కంకిపాడు బైపాస్ వెంబడి పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు



కంకిపాడు ప్రధాన మార్గంలో వ్యర్థాలు

కంకిపాడు: రోడ్డు మార్జిన్‌లను వ్యర్థాల బెడద వదలడం లేదు. అధికారుల అలసత్వం, పర్యవేక్షణా లోపం కారణంగా వ్యర్థాల గుట్టలు పేరుకుపోతున్నాయి. వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. అసలే వర్షాకాలం, వ్యాధుల కాలం కావడంతో ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉండటంతో ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే... విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, ప్రజలు వ్యర్థాల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రధాన రహదారి మార్జిన్‌లను వ్యర్థాలతో నింపేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని దుకాణదారులు పండ్లు, కూరగాయలు, మాంసం వ్యర్థాలతో పాటుగా కొందరు వ్యాపారులు సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను కూడా రోడ్డు మార్జిన్‌లు, వాటికి అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లలో పారబోస్తున్నారు. భవన నిర్మాణాలను తొలగించిన వ్యర్థాల గుట్టలతో రోడ్డు మార్జిన్‌లలో కనీసం నిలబడలేని పరిస్థితి ఏర్పడింది.

చినుకు పడితే కంపు...

ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటనల సమయంలో ఆయా ప్రాంతాల్లోని స్థానిక సంస్థల అధికారులు, అక్కడి మండల స్థాయి అధికారులు మొక్కుబడిగా వ్యర్థాలను తొలగించి చేతులు దులుపుకొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలను పారబోసే వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో వ్యాపారులు యథేచ్ఛగా పారబోయడం, వ్యర్థాలు పేరుకుపోవడం జరుగుతోంది. వ్యర్థాలు కుళ్లి తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. చిన్న చినుకు పడ్డా వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వెదజల్లడం, వ్యర్థ నీరు రహదారులపై పారడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

వెంటాడుతున్న వ్యాధుల భయం...

వ్యర్థాలు పేరుకుపోయి ఉండటంతో దోమలు, ఈగలకు ఆవాసంగా రోడ్డు మార్జిన్‌లు తయారయ్యాయి. గ్రామాలకు ఆనుకుని ఈ పరిసరాలు ఉండటంతో గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అసలే వర్షాకాలం.. వ్యాధుల కాలం కావడంతో ఇప్పటికే జలుబు, దగ్గు, మోస్తరు జ్వరాలతో ప్రజలు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. ఈ వ్యర్థాలపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతుంది. వ్యాధుల భయం పొంచి ఉండటంతో ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. పర్యవేక్షించాల్సిన మండల యంత్రాంగం కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటంతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి

గన్నవరం: హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ వినియోగంపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన గురువారం గన్నవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జయలక్ష్మి మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. వాహనదారుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని హైకోర్టు హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరి చేసినట్లు తెలిపారు. వాహనదారులు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రత నిబంధనలను తూచా తప్పక పాటించాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సిహెచ్.శ్రీనివాసబాబు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జీఎస్ఆర్ మూర్తి, ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ శివప్రసాద్, ఎన్టీటీఎఫ్ కళాశాల ఏఓ పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు మళ్లీ ప్రారంభిస్తారట.!



పెనమలూరులో గతంలో ప్రారంభించిన సచివాలయ భవనాలు



నూతన భవనాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించి ప్రారంభించిన భవనాలు
- టీడీపీ నేతల వింత పోకడ

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి ప్రారంభించిన సచివాలయ భవనాలను టీడీపీ నేతలు మరల తిరిగి ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు. ఈ వ్యవహారం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వార్డు, సచివాలయ వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చిన తర్వాత వాటికి నూతన భవనాలు నిర్మించారు. ఇందులో భాగంగా పెనమలూరు గ్రామంలో కనీస వసతులులేని పంచాయతీ భవనం ఉంటే దాని స్థానంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 1.20 కోట్లతో మూడు నూతన సచివాలయ భవనాలు నిర్మించింది. ఎన్నికలకు ముందే మూడు భవనాలను ప్రారంభించారు. ఇప్పుడు ఆ భవనాల్లో సచివాలయ సిబ్బంది విధులు కూడా నిర్వహిస్తున్నారు. కాగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ భవనాల శిలాఫలకాలు ధ్వంసం చేశారు.

మళ్లీ ప్రారంభిస్తారట..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన మూడు సచివాలయ భవనాలను తిరిగి టీడీపీ నేతలు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం సచివాలయ భవనాలు ప్రారంభిస్తున్నట్లు పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు స్థానిక నేతలకు సమాచారం ఇచ్చారు. అయితే గతంలోనే ప్రారంభించిన సచివాలయ భవనాలకు మళ్లీ ప్రారంభమేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో రైతుభరోసా కేంద్రానికి, వెల్‌నెస్ సెంటర్‌కు భవనాలు లేవని టీడీపీ నేతలు వాటికి నూతన భవనాలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోరంకిలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపాలిటీ కార్మికులు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో వచ్చే నెలలో సమ్మె చేపడతామని మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద గురువారం ఆయన ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించి కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తి మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు పాత జీతాలు ఇవ్వలేదన్నారు. జనవరి నెలలో పండుగ బోనస్, అలాగే హెల్త్ అలవెన్స్ రూ. 6 వేలు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికే కమిషనర్‌కు పలుమార్లు వినతిపత్రం అందజేశామని అయినా న్యాయం జరగలేదని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆగస్టు నెలలో సమ్మె చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు వై.సరళ, కె.విజయ, బేబీ మేరీ, టి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్స్‌కు క్రీడా సామగ్రి పంపిణీ



గన్నవరంలో జెడ్పీ హైస్కూల్‌కు క్రీడా సామగ్రి అందజేస్తున్న సత్యనారాయణరావు

గన్నవరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హెచ్‌సీఎల్, హీల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అవసరమైన తోడ్పాటునందిస్తున్నట్లు ఆ సంస్థ కోఆర్డినేటర్ బీ సత్యనారాయణరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల విద్యార్థుల కోసం గురువారం హెచ్‌సీఎల్, హీల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. అందుకే విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు గన్నవరం, గొల్లనపల్లి, కేసరపల్లి, దావాజీగూడెం హైస్కూల్స్‌కు రూ. 35 వేలు విలువైన క్రీడా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. బాలుర హైస్కూల్ హెచ్ఎం ఎస్.రవీంద్ర భవాని, వ్యాయామ ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, షేక్ మీరాసాహెబ్, ఆర్జా గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరణఅంకమ్మ తల్లికి ఆషాఢం సారె



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో నాయీ బ్రాహ్మణ వీధిలో కొలువైన శ్రీరణఅంకమ్మ తల్లికి గురువారం భక్తులు ఆషాఢ మాసం సారెను సమర్పించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాఢ సారె, వివిధ రకాల స్వీట్లు, నైవేద్యాలతో మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపు తర్వాత ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

హనుమాన్‌జంక్షన్ రూరల్: యువకుడి అదృశ్యంపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా నూజివీడు మండలం మర్రిబంధంకు చెందిన జొన్నలగడ్డ పవన్ కుమార్ (25) తన తండ్రి బైక్‌పై మెడికల్ షాప్‌కు వెళ్తున్న అని చెప్పి హనుమాన్‌జంక్షన్‌కు వచ్చాడు. ఎంతసేపటికి ఇంటికి తిరిగిరాకపోవడం, సెల్‌ఫోన్‌లో స్పందించకపోవడంతో భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. అయితే బాపులపాడు మండలం వేలేరు వద్ద పోలవరం కుడి ప్రధాన కాలువ గట్టుపై గుర్తు తెలియని వ్యక్తి బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ విడిచిపెట్టినట్లుగా పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన వెళ్లి వాటిని పరిశీలించడంతో అదృశ్యమైన జొన్నలగడ్డ పవన్‌కుమార్‌కు చెందినవిగా గుర్తించారు. దీంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలవరం కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక బైక్, వస్తువులు విడిచి పెట్టి ఎక్కడికైనా వెళ్లాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

పెనమలూరు: తన తండ్రి కనబడటం లేదని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు..

కానూరు సిరినగర్‌కు చెందిన మద్దంశెట్టి నాగ కనకదుర్గారావు కుటుంబ సభ్యులతో ఉంటూ ఆటోనగర్‌లో లారీ బిల్డింగ్ పనులు చేస్తాడు. తండ్రి రామకృష్ణారావు (80) నాగ కనకదుర్గారావుతో ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీన రామకృష్ణారావు ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. వయస్సు భారంతో మతిస్థిమితం లేదని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరో ఘటనలో...

పెనమలూరు: భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు పోరంకి సాయినగర్‌కు చెందిన సుగాలపల్లి రాజేశ్వరి, సోమిరెడ్డి జయరాజు భార్యభర్తలు. వీరికి ఒక కుమార్తె. రాజేశ్వరి ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. భర్త ఏ పనీ చేయడు. భర్తకు ఉన్న దురలవాట్లపై భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీన బయటకు వెళ్లివస్తానని జయరాజు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

రథ్ ఫెస్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రథ్ ఫెస్ట్‌లో విజేతలుగా నిలిచిన నలంద విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇస్కాన్ ఆధ్వర్యాన నగరంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జగన్నాథ్ రథ్ ఫెస్టివల్‌లో నిర్వహించిన పలు పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఉత్సవాల్లో భగవద్గీత శ్లోకాలు, సంగీత, సాహిత్య, నృత్య, క్విజ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్, ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టయిల్ పోటీలు నిర్వహించగా నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కాగా ఆ పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు వోకల్ మ్యూజిక్ జూనియర్, సీనియర్ విభాగాలతో పాటు, మ్యూజిక్ బ్యాండ్‌లలో మొదటి బహుమతులు పొందారన్నారు. సోలో డ్రామా, ఫ్యాన్సీ డ్రెస్ జూనియర్, సీనియర్ విభాగాల్లో, స్టోరీ రైటింగ్, క్విజ్, ఆర్ట్ విభాగాల్లో సైతం మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. క్లాసికల్ డ్యాన్స్ సోలో, స్టోరీ రైటింగ్, క్విజ్, సోలో సింగింగ్ విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను ఆమె అభినందించారు. నలంద విద్యార్థుల ఆల్‌రౌండ్ ప్రతిభకు ఇది నిదర్శనంగా పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రత్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

రహదారులు.. గోతులమయం



దావాజీగూడెంలో రోడ్డును దాటేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు



బీబీగూడెం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడ్డ గోతులు



పి.నైనవరం గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో ఎన్టీటీఎఫ్ కళాశాల రోడ్డు చిన్న సైజు చెరువును తలపిస్తోంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా జలమయమైంది. రమణమ్మచెరువు కాలనీతో పాటు ఎన్టీటీఎఫ్ కళాశాల, ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాలకు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడటంతో కాలనీవాసులు, కళాశాల, వసతి గృహ విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులతో పాటు విద్యార్థులు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్అండ్‌బీ రహదారి

పి.నైనవరం(విజయవాడరూరల్): విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్న ఫిర్యాది నైనవరం గ్రామంలో మెయిన్ రోడ్డు అధ్వానంగా మారింది. చినుకు పడితే చాలు రోడ్డు మీదే నీరు నిలుస్తోంది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు లేకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. అధిక వర్షం కురిస్తే సమీపంలోని ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షం నీరు రోజుల తరబడి ఉండటంతో మురుగునీటిలోనే నడవాల్సి వస్తోంది. ఇప్పటికైన అధికారులు స్పందించి డ్రెయినేజీ కాల్వలు నిర్మించి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని బీబీగూడెం గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడ్డ గోతులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్ ఎదుట రోడ్డుపై పదుల సంఖ్యలో గోతులు ఏర్పడ్డాయి. దీంతో గన్నవరం-ఆగిరిపల్లి ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న బీబీగూడెం దాటాలంటే ఇక్కట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో సంఘం అన్నివేళలా అండగా ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌నందు గురువారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సభ్యత్వం కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఎన్జీవో సంఘంలో వార్డు సచివాలయ ఉద్యోగులు నేటి నుంచి సభ్యులుగా కొనసాగడం సంతోషంగా ఉందన్నారు. తమ సంఘంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కుటుంబంలో సభ్యులుగానే తాము భావిస్తున్నామని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఇకపై తాము కూడా పోరాటం చేస్తామన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రాజుబాబు, నగర శాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, నాయకులు నజీరుద్దీన్, రాజశేఖర్, వి.వి. ప్రసాద్, శ్రీనివాసరావు, శివలీల, శ్రీనివాస్, షేక్ ఖాసిం, కె.శివశంకర్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కె.గోపయ్య, మెహబూబ్, వి.సుజాత, సూర్యప్రభ, ఉద్యోగులు పాల్గొన్నారు.